sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 29-09-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 160 EDITOR: ROHINI



సినీ నిర్మాతగా 21 ఏళ్ల స్టూడెంట్

పార్ట్ టైం ఉద్యోగాలు చేసి 60 లక్షల పెట్టుబడి



- మరో ఇద్దరు మహిళా నిర్మాతలతో ప్రయాణం
- మొత్తం 2 కోట్ల పెట్టుబడి... 400 కోట్ల కలెక్షన్
- నీమ్ కరోలి బాబా జీవిత కథతో అద్భుతం
- బాక్సాఫీస్ వద్ద 'హనుమాన్ అంశ్' జోరు

సినిమా ఇండస్ట్రీలో 100 కోట్లు, 200 కోట్లు... ఇలా వందల కోట్లు పెట్టి తీసినా కలెక్షన్లు రావడం కష్టమైపోతున్న ఈ రోజుల్లో కేవలం ఒక కోటి 80 లక్షల రూపాయల బడ్జెట్‌తో తెరకెక్కిన ఒక చిన్న సినిమా ఏకంగా 400 కోట్ల రూపాయలు వసూలు చేసింది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది అక్షరాలా నిజం. పెద్ద స్టార్స్, భారీ పబ్లిసిటీ లేకపోయినా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం సృష్టించిన సంచలనం చూసి బిగ్గజాలే నోరెళ్లబెడుతున్నారు. అసలు ఈ సినిమా వెనుక ఉన్న ఆ ముగ్గురు మహిళలు ఎవరు? 1 కోటి 80 లక్షల పెట్టుబడి నుంచి 400 కోట్ల వసూళ్ల వరకు ఎలా చేరిందో తెలుసుకుందాం.

- సహనం వందే, హైదరాబాద్

విశాల్ చతుర్వేది రాసిన 'డివైన్ డిటోర్: దట్ చేంజ్డ్ మై లైఫ్' అనే పుస్తకం ఆధారంగా 'హనుమాన్ అంశ్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఆయనే ఈ చిత్రానికి కథ, దర్శకత్వం వహించారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఇండియాలో సాగే ఈ కథలో... తల్లి మరణం తర్వాత లక్ష్మీ నారాయణ్ అనే యువకుడు ఇల్లు వదిలి ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణం ప్రారంభిస్తాడు. ఉత్తర భారతదేశంలో అతను చేసిన పర్యటనలు, ఆ తర్వాత అతను 'నీమ్ కరోలీ బాబా'గా ఎలా మారారనేదే ఈ సినిమా ముఖ్య కథాంశం. ఇందులో లక్ష్మీ నారాయణ్ శర్మ పాత్రలో శోభినావ్ సత్య నటించగా, చందన్ కె ఆనంద్, నిఖిల్ దూబే, అనిల్ రస్తోగి, సుగంధ మల్హోత్రా ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించారు.

బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర...

సాధారణంగా భక్తిరస చిత్రాలంటే తక్కువ బడ్జెట్, పరిమితమైన ఆడియన్స్ మాత్రమే ఉంటారనే అపోహ ఉంటుంది. కానీ కేవలం కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో ఒక చిన్న ప్రయత్నంగా మొదలైన ఈ చిత్రం ఆ అపోహలన్నింటినీ తుత్తునియలు చేస్తూ ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ సినిమా మేకింగ్ వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. రాగిణి సోనా, నమ్రతా జి. సింగ్, అనుప్రియ నాగర్ అనే వేర్వేరు తరాలకు చెందిన ముగ్గురు మహిళా నిర్మాతలు ఈ ప్రాజెక్ట్‌ను నమ్మి ముందుకు వచ్చారు. ప్రచారంలో లేని వీరు ప్రతి ఒక్కరూ 60 లక్షల రూపాయల చొప్పున పెట్టుబడిగా పెట్టారు.

నిర్మాతగా విద్యార్థి ప్రయాణం...

ఇందులో 21 ఏళ్ల అనుప్రియ నాగర్ ప్రయాణం మరింత ఆసక్తికరం. లండన్ బాత్ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ చదువుతున్న సమయంలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ డబ్బు దాచుకుంది. స్టీవ్ జాబ్స్, మార్క్ జుకర్ బర్గ్ వంటి ప్రముఖులకు నీమ్ కరోలి బాబాతో ఉన్న అనుబంధం గురించి తెలుసుకుని ఆకర్షితురాలైంది. ఇండియా తిరిగి వచ్చాక ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఫండ్స్ కొరత ఉన్న సమయంలో తన సేవింగ్స్ 60 లక్షలను పెట్టుబడిగా పెట్టింది. ఇక మిగిలిన ఇద్దరు మహిళా నిర్మాతలు రాగిణి సోనా, నమ్రతా సింగ్‌లు షూటింగ్ ప్రారంభానికి ముందే పెట్టుబడి పెట్టారు. దర్శకుడు విశాల్ చతుర్వేది బడ్జెట్ దాటకుండా చాలా ప్లాన్డ్‌గా పనిచేశారు. మొదట 26 రోజుల్లో అనుకున్న షూటింగ్‌ను రూపాయి కూడా అనవసరంగా ఖర్చు చేయకుండా సహజసిద్ధమైన లొకేషన్ల లో కేవలం 22 రోజుల్లోనే ముగించారు.

'వర్డ్ ఆఫ్ మౌత్' ప్రచారం తిరుగులేని బలం...

అయితే ఈ ప్రయాణం అంత సులువుగా సాగలేదు. సినిమా పూర్తయ్యాక పెద్ద ఓటీటీ సంస్థలు దీనిని తిరస్కరించడంతో నిర్మాతలు ధైర్యం చేసి థియేటర్లలోనే విడుదల చేశారు. కానీ మొదటి రోజు కేవలం 10 లక్షల రూపాయల కలెక్షన్లు మాత్రమే రావడంతో అంతా నిరాశపడ్డారు. మొదటి వారంలో దాదాపు ఒక కోటి మాత్రమే రావడంతో థియేటర్ల సంఖ్య కూడా తగ్గిపోయింది. పాత షోల స్థానంలో వేరే సినిమాలు వచ్చాయి. కథ ముగిసిపోయిందనుకున్న సమయంలో అసలైన మ్యాజిక్ మొదలైంది.

సినిమా చూసిన ప్రేక్షకుల 'వర్డ్ ఆఫ్ మౌత్' ప్రచారం తిరుగులేని బలాన్ని ఇచ్చి మూడో వారం నుంచి థియేటర్లు హౌస్‌ఫుల్ కావడం ప్రారంభమైంది.



అనుప్రియ నాగర్

మూడో వారం నుండి కలెక్షన్ల సునామీ...

మూడో వారం నుండి ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టించి రోజుకు 7 నుంచి 8 కోట్ల రూపాయల వసూళ్లను సాధించింది. 400 కోట్లు దాటేసి బడ్జెట్ కంటే 200 రెట్లకు పైగా లాభాలను రాబట్టింది. ఈ భారీ సక్సెస్ చూసి, మొదట తిరస్కరించిన ఓటీటీ సంస్థలే ఇప్పుడు డిజిటల్ హక్కుల కోసం కోట్లలో ఆఫర్లు ఇస్తున్నాయి. మరోవైపు భక్తి, ప్రేమ, నిస్వార్థ సేవ అనే అంశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఊహించని విజయంతో ఈ సినిమాను మూడు భాగాలుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సహ నిర్మాత నమ్రతా సింగ్ తెలిపారు. రాబోయే భాగాలను అంతర్జాతీయ స్థాయిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పెద్ద స్టార్స్, భారీ ప్రచారం కంటే ప్రేక్షకుల గుండెను తాకే కంటెంట్ ఉంటే విజయం ఎక్కడకీ పోదని ఈ సినిమా నిరూపించింది.

ధనికుల రాముడు... పేదల శివుడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చమత్కారం

- దక్షిణాదికి శివయ్య... ఉత్తరాదికి రామయ్య
- ఢిల్లీలో పొలిటికల్ అండ్ డివైన్ డిబేట్
- బీజేపీ హర్ హర్ మహాదేవ్ ఎందుకనదని ఫైర్
- ఆ పార్టీ జై శ్రీరామ్ కే పరిమితమని విమర్శ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వేదికపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలోనూ, రాజకీయ వర్గాల్లోనూ పెద్ద దుమారమే రేపుతున్నాయి. దేవుళ్ల పేరు చెప్పి రాజకీయాలు చేయడం కొత్తేమీ కాదు కానీ ఆయన చేసిన ఒక డిఫరెంట్ అనాలిసిస్ ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ద్రావిడులు, ఆర్యులు అంటూ మొదలుపెట్టి... అసలు ఏ పార్టీ ఏ దేవుడిని సొంతం చేసుకుందో రేవంత్ రెడ్డి చాలా సరదాగా, అదే సమయంలో ఆలోచింపజేసేలా చెప్పారు. అసలు ఆయన ఏం మాట్లాడారో, దాని వెనుక ఉన్న రాజకీయ మర్మం ఏంటో తెలుసుకుందాం. - సహనం వందే, న్యూఢిల్లీ

ఢిల్లీలో సోమవారం జరిగిన ఒక జాతీయస్థాయి కాన్ఫరెన్స్ లో మాట్లాడిన రేవంత్ రెడ్డి... ఉత్తరాదికి దక్షిణాదికి ఉన్న తేడాను సింపుల్ గా వివరించారు. మనం ద్రావిడులమని, ఉత్తరాది వాళ్లు ఆర్యులని ఆయన ఒక అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, నమ్మకాల గురించి ప్రస్తావించారు. దక్షిణాదిలో శివుడిని ఎంతగా ఆరాధిస్తారో గుర్తుచేస్తూ, ఉత్తరాదిన శ్రీరాముడి ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ వ్యత్యాసాన్ని వివరిస్తూనే అసలు రాజకీయం ఎక్కడ మొదలైందో ఆయన పాయింట్ అవుట్ చేశారు.

'హర్ హర్ మహాదేవ్' అని జేపీ ఎందుకనదు?

శ్రీరాముడు అందరి దేవుడైనప్పటికీ, బీజేపీ పార్టీ ఆయనను పూర్తిగా తమ స్వంతం చేసుకుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. శ్రీరాముడి పేరును రాజకీయం కోసం వాడుకుంటూ, ఆయనను హైజాక్ చేశారనే కోణంలో మాట్లాడారు. బీజేపీ నేతలు ఎక్కడ మాట్లాడినా 'జై శ్రీరామ్' అని మాత్రమే అంటారని ఆయన గుర్తుచేశారు. రామనామాన్ని ఒక రాజకీయ నినాదంగా మార్చేశారని ఆయన విమర్శించారు. దేవుడిని ఒక పార్టీకి మాత్రమే పరిమితం చేయడం సరైంది కాదనేది ఆయన ముఖ్య ఉద్దేశం. మరి శ్రీరాముడిని బీజేపీ తీసుకుంటే, శివుడి పరిస్థితి ఏంటనే ప్రశ్నకు రేవంత్ రెడ్డి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. 'హర్ హర్ మహాదేవ్' అని బీజేపీ నేతలు ఎప్పుడైనా అంటారా అని ఆయన ప్రశ్నించారు. ఏ వేదికపై చూసినా వాళ్లు శివుడి పేరు ఎత్తరని, కేవలం జై శ్రీరామ్ అని మాత్రమే అంటారని స్పష్టం చేశారు. పరమశివుడిని వారు ఎందుకు పక్కన పెట్టేశారో అర్థం కావడం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇది కేవలం భక్తికి సంబంధించిన విషయం కాదు, రాజకీయ వ్యూహమని ఆయన అభిప్రాయపడ్డారు.

శివుడు పేదల దేవుడు...

ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి ఒక ఆసక్తికరమైన పోలిక తెచ్చారు. శివుడు పేద ప్రజల దేవుడని, సాధారణ మానవులకు అందుబాటులో ఉండే దేవుడని ఆయన చెప్పారు. కానీ శ్రీరాముడిని ధనవంతుల దేవుడిగా మార్చేశారని వ్యాఖ్యానించారు. పేదవారి ఆరాధ్యదైవమైన శివుడిని పక్కన పెట్టి, సంపన్నుల భావజాలానికి ప్రతీకగా ఉన్న శ్రీరాముడిని బీజేపీ భుజాన వేసుకుందని అన్నారు. ఈ కామెంట్ సభలో ఉన్న వారందరినీ ఆశ్చర్యపరచడమే కాకుండా పెద్ద ఎత్తున నవ్వులు పూయించింది. బీజేపీ ఒక సంపన్నుల పార్టీ అని, అందుకే వాళ్లు శ్రీరాముడిని ఎంచుకున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పేదల బాధలు తెలిసిన శివుడిని వారు పట్టించుకోరని సరదాగా వ్యాఖ్యానించారు. ఒక పొలిటికల్ లీడర్ గా ఆయన చేసిన ఈ అనాలిసిస్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. దేవుళ్ల ఆధారంగా భావజాలాన్ని విడదీసి చెప్పడం వెనుక ఆయన వ్యూహం ఉందనే చర్చ నడుస్తోంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి ఈ శైలి ఇప్పుడు టాక్ ఆఫ్ ది నేషన్ గా మారింది.

అనామక పార్టీల వేల కోట్ల కుంభకోణం

విరాళాల ముసుగులో 1,869 కోట్ల దందా

- కేవలం మూడు పార్టీల అక్రమ వ్యవహారం
- పెద్ద పెద్ద పార్టీలకే ఈ స్థాయి విరాళాలు లేవు
- గుజరాత్‌లో 15 మందిపై కేసులు నమోదు

రాజకీయ పార్టీలకు చందాలు ఇవ్వడం, దానికి పన్ను మినహాయింపు పొందడం చట్టబద్ధంగా జరిగే విషయమే. కానీ అసలు ఓట్లే పడని అనామక రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకుని, ఏకంగా రూ. 1,869 కోట్ల నకిలీ చందాల దందా నడిపితే ఎలా ఉంటుంది? పైగా ప్రభుత్వ ఖజానాకు రూ. 560 కోట్ల పన్ను గండి కొడితే ఎలా ఉంటుంది? గుజరాత్‌లో వెలుగు చూసిన ఈ విచిత్రమైన ఘరానా స్కామ్ గురించి తెలిస్తే మతిపోతుంది! అసలు ఈ చందా నాటకం ఎలా ఆడారో, షెల్ కంపెనీల వెనుక ఉన్న అసలు కథేంటో చూద్దాం. - సహనం వందే, గుజరాత్

గుజరాత్ రాష్ట్రంలో నమోదైన, గుర్తింపు లేని మూడు రాజకీయ పార్టీలపై సీఐడీ క్రైమ్ పోలీసులు సంచలన కేసులు నమోదు చేశారు. ఇన్ కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ మూడు రాజకీయ పార్టీలు కేవలం పన్ను ఎగవేత దారుల కోసం మాత్రమే పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రాజకీయ పార్టీల పేరుతో నకిలీ విరాళాలు సేకరించి, ఆ మొత్తాన్ని హవాలా మార్గాల్లో మళ్లీ దాతలకే తిరిగి ఇచ్చేవారు. ఈ మొత్తం వ్యవహారంలో చట్టవిరుద్ధంగా కోట్లాది రూపాయల పన్ను ఎగవేత జరిగిందని దర్యాప్తులో స్పష్టమైంది.

కాగితాలకే పరిమితమైన మూడు పార్టీలు

ఈ కుంభకోణంలో ప్రధానంగా మూడు రాజకీయ పార్టీలు భాగమయ్యాయని ఇన్ కమ్ టాక్స్ దర్యాప్తులో తేలింది. అందులో మొదటిది 'భారతీయ నేషనల్ జనతా దళ్' కాగా, రెండోది 'స్వతంత్రతా అభివ్యక్తి పార్టీ', మూడోది 'గరీబ్ కళ్యాణ్ పార్టీ'. ఈ మూడు పార్టీలు కలిసి సుమారు 1,869 కోట్ల రూపాయల విరాళాలను పొందినట్లు రికార్డుల్లో చూపించాయి. దీనివల్ల ప్రభుత్వానికి ఏకంగా రూ. 560 కోట్ల ఆదాయ పన్ను నష్టం వాటిల్లిందని ఐటీ శాఖ లెక్కగట్టింది. ఈ పార్టీలన్నీ కేవలం కాగితాలకే పరిమితమై, ఆర్థిక అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.

మాస్టర్‌మైండ్ హస్తం - వేల కోట్ల మోసం

ఈ మూడు పార్టీలలో అతిపెద్ద మోసానికి పాల్పడింది 'భారతీయ నేషనల్ జనతా దళ్' అని ఐటీ నివేదిక పేర్కొంది. ఈ ఒక్క పార్టీయే ఏకంగా 56,238మంది దాతల నుంచి 1,143 కోట్ల రూపాయల విరాళాలు పొందినట్లు చూపించింది. దీని మూలంగా ప్రభుత్వ ఖజానాకు సుమారు 343 కోట్ల వరకు పన్ను ఆదాయానికి నష్టం వాటిల్లింది. ఈ పార్టీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు సురేంద్రకుమార్ గజేరా ఈ కుంభకోణానికి మాస్టర్‌మైండ్‌గా వ్యవహరించాడని పోలీసులు గుర్తించారు.

మిగిలిన రెండు పార్టీల బాగోతం

ఇక మిగిలిన రెండు పార్టీల ఆర్థిక కార్యకలాపాలను పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. 'స్వతంత్రతా అభివ్యక్తి పార్టీ' ఖాతాల్లోకి 519 కోట్ల చందాలు రాగా, దీనివల్ల 155 కోట్ల పన్ను ఎగవేత జరిగింది. అలాగే 'గరీబ్ కళ్యాణ్ పార్టీ' పేరిట రూ. 206 కోట్ల విరాళాలు జమ చేసి, రూ. 62 కోట్ల మేరకు పన్ను ఎగ్గొట్టారు. ఈ వ్యవహారంలో పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు ముగ్గురు చార్టర్డ్ అకౌంటెంట్లు కూడా కీలక పాత్ర పోషించారని తేలింది.

షెల్ కంపెనీల ద్వారా నకిలీ బిల్లుల దందా

అసలు ఈ విరాళాల నాటకం వెనుక ఉన్న కుట్ర వెలుగు చూసింది. పెద్ద పెద్ద వ్యాపారులు లేదా దాతలు బ్యాంకు ఖాతాల ద్వారా ఈ పార్టీలకు విరాళాల సొమ్మును జమ చేసేవారు. అలా జమ చేసిన సొమ్మును పొందినందుకు పార్టీల నుంచి అధికారిక రసీదులు కూడా పొందేవారు. ఆ రసీదులతో ఐటీ రిటర్న్స్‌లో ఆదాయ పన్ను మినహాయింపులు పొంది పన్ను కట్టకుండా తప్పించుకునే వారు. విరాళంగా వచ్చిన డబ్బును పార్టీలు కేవలం తమ వద్దే ఉంచుకోకుండా, జై రామ్ ఎంటర్‌ప్రైజెస్, కిసాన్ ఎంటర్‌ప్రైజెస్ వంటి షెల్ కంపెనీలకు మళ్లించేవి. ఆ కంపెనీల ద్వారా ఆహార ధాన్యాలు, ఇతర సరుకులు కొనుగోలు చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించేవారు. ఆ బిల్లుల ఆధారంగా బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసేవారు. కాగితాలపై వ్యాపారం జరిగినట్లు చూపిస్తూ అసలు సొమ్మును నగదు రూపంలోకి మార్చేవారు.